సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023

తీజ్ సంబురం

ఎల్లారెడ్డిపేట మండలంలోని బుగ్గరాజేశ్వరతండాలో గురువారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

– ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)



న్యూస్‌రీల్

గ్రామాలాభివృద్ధే బీఆర్‌ఎస్ ధ్యేయం



కోనరావుపేట(వేములవాడ): బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. మండలంలోని రాజన్నగొల్లపల్లి(కొలనూర్)లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న జీపీ భవనానికి గురువారం స్లాబ్ పోసిన సందర్భంగా సందర్శించారు. మండలంలోని 28జీపీలకు 22 భవనాలు మంజూరైనట్లు తెలిపారు. కోనరావుపేట మండలంలో ఇప్పటి వరకు రూ.5కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సర్పంచులు బొజ్జం వసంత, వెన్నమనేని వంశీకృష్ణారావు, సురేశ్‌యాదవ్, ఆరె లత, సంతోష్ పాల్గొన్నారు.

ఎన్‌-క్వాస్ గుర్తింపు పనులు చేపట్టండి




బోయినపల్లి(చొప్పదండి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెరుగైన సేవలందించేందుకు ఎన్‌క్వాస్ గుర్తింపు పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని విలాసాగర్ పీహెచ్‌సీని గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. పీహెచ్‌సీలో జరుగుతున్న శానిటేషన్, ప్లంబర్, విద్యుత్ పనులను పరిశీలించారు. కేంద్ర బృందం వచ్చేలోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, డీపీవో ఉమాదేవి, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, డాక్టర్ అనిత, సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

'బీసీలకు అన్యాయం చేస్తే సహించం'



సిరిసిల్లటౌన్: బీసీలకు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వకుండా అన్యాయం చేసే పార్టీలను సహించబోమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు స్పష్టం చేశారు. సిరిసిల్లలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా శాఖ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన నిరసనలో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు 60 సీట్లు కేటాయించాలని కోరారు. బీఆర్‌ఎస్ టిక్కెట్ కేటాయింపులను సవరించాలన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు 10 శాతం సీట్లు కేటాయించారని 10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 60 శాతం ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. నాయకులు వీరవేణి మల్లేశం, కంచర్ల రవిగౌడ్, కందుకూరి రామాగౌడ్, కమలాకర్, రాజు, కైలాస్, సుజిత్, నవీన్, కృష్ణ ఉన్నారు.

గ్రామీణ క్రీడలకు పూర్వవైభవం తేవాలి



సిరిసిల్ల: గ్రామీణ క్రీడలకు పూర్వవైభవం తేవాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం గ్రామోత్సవ్ క్రీడల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. స్థానిక మినీస్టేడియంలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 26, 27 తేదీల్లో క్రీడల గ్రామోత్సవం జరుగుతుందన్నారు. వాలీబాల్, త్రోబాల్ క్రీడల్లో రెండు రోజులపాటు క్లస్టర్ లెవల్‌లో మ్యాచ్‌లు పురుషులు, మహిళలకు వేర్వేరు జరుగుతాయన్నారు. ఫైనల్ మ్యాచ్‌లు సెప్టెంబరు 23న తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, డీపీఆర్‌వో మామిండ్ల దశరథం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ చేనేత జిల్లా అధ్యక్షుడిగా గోనె ఎల్లప్ప



సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ చేనేత సెల్ విభాగం అధ్యక్షుడిగా సిరిసిల్లకు చెందిన గోనె ఎల్లప్ప నియమితులయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ వీవర్స్ సెల్ అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీచేశారు.

మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు షురూ..

'ఉన్నత చదువుల కోసం అందరూ దేశ రాజధాని ఢిల్లీకి వెళ్తారు. కానీ మెడిసిన్ చదివేందుకు ఢిల్లీకి చెందిన దినకరన్ సిరిసిల్లకొచ్చాడు. సిరిసిల్లలో ఈ ఏడాది ప్రారంభమవుతున్న మెడికల్ కాలేజీలో తొలి అడ్మిషన్ పొందాడు. ఆలిండియా కోటాలో ఎంబీబీఎస్ ప్రవేశం పొందిన దినకరన్ సిరిసిల్ల మెడికల్ కాలేజీలో తొలి సీటు దక్కించుకున్నారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, వైస్‌ప్రిన్సిపాల్ ఎండీ ఇక్బాల్ హైమద్, ప్రొఫెసర్లు అన్వర్ ఉన్నీసా, రంజిత్ విద్యార్థితో కాలేజీ వద్ద మొక్కను నాటించారు. గురువారం సాయంత్రం వరకు మొత్తం ఆరుగురు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో చేరారు. ఈనెలాఖరులోగా వంద మంది చేరనున్నారు. సెప్టెంబరు మొదటి వారంలో మెడికల్ కాలేజీలో తరగతులు ప్రారంభమవుతాయి.

- తొలి విద్యార్థి ఢిల్లీకి చెందిన దినకరన్
- సెప్టెంబరు మొదటివారంలో తరగతులు
- తుది దశకు చేరిన భవనం పనులు
- త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభం



సిరిసిల్ల శివారులోని పెద్దూరు వద్ద మెడికల్ కాలేజీ భవనం

సిరిసిల్ల: జిల్లా చరిత్రలో వైద్యరంగంలో సరికొత్త అధ్యాయానికి తెరలేచింది. సిరిసిల్లలోని మెడికల్ కాలేజీలో ప్రవేశాలు మొదలయ్యాయి. ఈ కాలేజీకి వంద ఎంబీబీఎస్ సీట్లను కేటాయించగా.. ఇప్పటికే ఆరుగురు అడ్మిషన్లు పొందారు. పెద్దూరు బైపాస్ రోడ్డులో పదెకరాలలో రూ.40కోట్లతో నిర్మిస్తున్న భవనం తుది దశకు చేరింది. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ నిర్వహిస్తున్నారు.

సిరిసిల్లకు సీఎం కానుక

సీఎం కేసీఆర్ 2021 జూలై 4న సిరిసిల్లకు మెడికల్ కాలేజీని ప్రకటించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు చొరవతో మెడికల్ కాలేజీ మంజూరైంది. ఈ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి ఏడాది తరగతులు సెప్టెంబరు మొదటివారంలో ప్రారంభంకానున్నాయి. కాలేజీలోని వంద సీట్లలో 15 ఆలిండియా కోటాలో కేటాయించారు. మరో 85 సీట్లు మన రాష్ట్రస్థాయి విద్యార్థులకు దక్కుతాయి. 40 సీట్లు అబ్బాయిలకు, 60 అమ్మాయిలకు కేటాయించారు. అబ్బాయిలు, అమ్మాయిలకు వేర్వేరు ప్రైవేటు భవనాల్లో హాస్టళ్లను సిద్ధం చేశారు.



కాలేజీలో చేరిన తొలి విద్యార్థి దినకరన్‌కు అడ్మిషన్ కార్డు అందిస్తున్న ప్రిన్సిపాల్

సీఎంతో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

మెడికల్ కాలేజీని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని పూర్తిస్థాయిలో మాతాశిశు సంరక్షణ, నవజాత శిశువుల కేంద్రంగా మార్చనున్నారు. 340 బెడ్లతో ప్రసూతి విభాగం సిద్ధమవుతుండగా, ఇప్పటికే ప్రతి నెలా 360 ప్రసవాలు జరుగుతున్నాయి. జనరల్ ఆస్పత్రిని మొత్తంగా మెడికల్ కాలేజీకి మార్చనున్నారు. జిల్లా ప్రజలకు ఉచిత వైద్యసేవలు 24 గంటల బోధనాస్పత్రిలో అందుతాయి. సిరిసిల్ల జిల్లాలో ఏ ప్రైవేటు ఆస్పత్రిలో లేని విధంగా అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉండనున్నారు.

నెలాఖరులోగా అందరూ వస్తారు

మెడికల్ కాలేజీలో కౌన్సిలింగ్ ద్వారా విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు. ఇప్పటికే ఆరుగురు వచ్చారు. నెలాఖరులోగా వంద మంది చేరుతారు. సెప్టెంబరు మొదటి వారంలో తరగతులు ప్రారంభమవుతాయి. కాలేజీ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. ఎంబీబీఎస్ మొదటి ఏడాది వైద్యపాఠాలు బోధించేందుకు మౌలిక వసతులు సమకూరాయి.

– డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సిరిసిల్ల

మహిళలను మహారాణులు చేద్దాం



మాట్లాడుతున్న గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ శోభ

- తెలంగాణ గ్రామీణబ్యాంకు చైర్‌పర్సన్ శోభ

వేములవాడ: మహిళలను మహారాణులను చేసేందుకే తెలంగాణ గ్రామీణ బ్యాంకు మహిళా సంఘాలకు రూ.42 కోట్ల రుణాలు అందిస్తుందని బ్యాంకు చైర్‌పర్సన్ శోభ పేర్కొన్నారు. పట్టణంలోని త్రినేత్ర ఫంక్షన్‌హాలులో గురువారం జరిగిన చెక్కుల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో రుణమేళా నిర్వహిస్తున్నామన్నారు. 350 గ్రూప్ సభ్యులకు రుణాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. రూ.20 లక్షల వరకు కుటీర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రుణాలు అందజేస్తామని తెలిపారు. డీఆర్డీవో గౌతమ్‌రెడ్డి, ఏఆర్‌డీవో రవికుమార్, డీపీఎం సుధారాణి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, శ్రీనివాసరావు, రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

బ్యాంకును సందర్శించిన చైర్‌పర్సన్ శోభ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): టీజీబీ చైర్‌పర్సన్ వై.శోభ తంగళ్లపల్లి శాఖను సందర్శించారు. ఖాతాదారులతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, సామాజిక భద్రత పథకాలను ఏపీవై, పీఎంజేజేబీవై, పీఎంఎస్బీవై ఖాతాదారుల కుటుంబ సభ్యులు విధిగా తీసుకోవాలని సూచించారు. రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, సిబ్బంది అప్పారావు, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, దేవేందర్, రజిత, యశ్వంత్, నందిని, వినోద్, రజిత, స్వర్ణ పాల్గొన్నారు.

పొగాకు వాడకాన్ని నియంత్రించండి

సిరిసిల్ల: జిల్లాలో పొగాకు వాడకాన్ని నియంత్రించాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం జాతీయ పొగాకు ఉత్పత్తుల నియంత్రణ, సిగరేట్, టొబాకో ప్రాజెక్టు యాక్ట్–2003పై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సత్యప్రసాద్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద పొగాకు వాడకం, ధూమపానంతో కలిగే నష్టాలపై ప్రచారం చేయాలని సూచించారు. బహిరంగంగా పొగ తాగే వారికి జరిమానా విధించాలన్నారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, జిల్లా కార్మిక అధికారి రఫీ, డీపీఆర్వో దశరథం, ఎస్సై తిరుపతి, ఎన్‌జీవో ప్రతినిధి చింతోజు భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి 'నాగుల' దరఖాస్తు

- మరో దరఖాస్తు అందించిన 'సంగీతం'



దరఖాస్తు అందిస్తున్న సత్యనారాయణగౌడ్

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ నుంచి సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్ గురువారం దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు తన దరఖాస్తును అందించి మాట్లాడారు. తండ్రి నాగుల మల్లయ్యగౌడ్ వారసత్వంతో ఐదు దశాబ్దాలుగా తాను పార్టీలో ఉంటున్నానని పేర్కొన్నారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు సైతం నిర్వర్తించానని వివరించారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఇక పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ కూడా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ గాంధీ భవన్‌లో దరఖాస్తు సమర్పించారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీలో వివిధ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న తనకు అవకాశం కల్పించాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంకావాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- నోడల్ అధికారుల నియామకం



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులు సిద్ధంకావాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో గురువారం నోడల్ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు 17 అంశాలపై నియమించిన నోడల్ అధికారులు సజావుగా ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని కోరారు. నోడల్ అధికారులు తమ విధులపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. మానవ వనరుల నిర్వహణ, శిక్షణ, రవాణా, ఐటీ సైబర్ భద్రత, స్వీప్, ఈవీఎం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాల పరిశీలనకు జిల్లాలో నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అన్ని అంశాలపై పూర్తి అవగాహన పెంచుకుని ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, సీపీవో శ్రీనివాసాచారి, డీఏవో భాస్కర్, ఈడీఎం శ్రీనివాస్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నోడల్ అధికారులు వీరే..

అధికారి	హోదా	బాధ్యతలు
ఎ.రమేశ్‌కుమార్	డీఈవో	ఎన్నికల సిబ్బంది నియామకం
పీబీ శ్రీనివాసాచారి	సీపీవో	సిబ్బందికి శిక్షణ, సమాచారం ప్లానింగ్
ఎండీ ఆయాజ్	మున్సిపల్ కమిషనర్	సామగ్రి నిర్వహణ ఏర్పాట్లు
వై.కొండల్‌రావు	డీటీవో	రవాణా ఏర్పాట్లు
ఆర్.శ్రీనివాస్	ఈడీఎం	కంప్యూటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఐటీ
కె.నర్సింహులు	ఏపీడీ, డీఆర్‌డీఏ	స్వీప్
అఖిల్ మహాజన్	ఎస్పీ	శాంతిభద్రతలు, రక్షణ ప్రణాళిక
ఎన్.ఖీమ్యానాయక్	అదనపు కలెక్టర్	ఈవీఎంల నిర్వహణ
వి.భాస్కర్	డీఏవో(వ్యవసాయం)	ఎంసీసీ
బి.స్వప్న	ఆడిట్ ఆఫీసర్	ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ
పి.లక్ష్మీరాజం	డీడబ్ల్యూవో	బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్‌ల నిర్వహణ
ఎం.దశరథం	డీపీఆర్వో	మీడియా(ఎంసీఎంసీ) నిర్వహణ
ఎన్.ఆనంద్‌కుమార్	ఆర్డీవో	ఓటర్ల జాబితా సిద్ధం చేయుట
వినోద్‌కుమార్	ఎస్సీ కార్పొరేషన్ ఈడీ	ఓటరు హెల్ప్ లైన్, ప్రచారం
ఎస్.సైదులు	ఏడీ మైనింగ్	పరిశీలకులు
మదన్‌మోహన్	అదనపు డీఆర్‌డీవో	నివేదిక తయారీ

బీఆర్‌ఎస్ హామీలన్నీ ఉత్త కోతలే

- బీజేపీ నాయకుల ఆరోపణ
- సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్ ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు



ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడికి వచ్చిన బీజేపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

సిరిసిల్లటౌన్: ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ ఉత్త కోతలేనని బీజేపీ నాయకులు ఆరోపించారు. గురువారం సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. నాయకులు రోడ్డు బైఠాయించి, మాట్లాడారు. దళితులను బీఆర్‌ఎస్ నమ్మించి, వంచించిందన్నారు. పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు అందని ద్రాక్షలా మారాయని పేర్కొన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్య మిథ్యగా మారిందని, విద్యార్థులకు రీయింబర్స్ ఇవ్వడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని మండిపడ్డారు. చివరకు పోలీసులు వారిని బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించి, ఠాణాకు తీసుకెళ్లారు. రాష్ట్ర నాయకులు లగిశెట్టి శ్రీనివాస్, ఆడెపు రవీందర్, మట్ట వెంకటేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, నాయకులు పాల్గొన్నారు.

శిక్షల శాతం పెరగాలి

- మిస్సింగ్ కేసులపై దృష్టి పెట్టాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: పారదర్శకంగా విచారణ చేపట్టి, శిక్షల శాతం పెరిగేలా చూడాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపించి వాటి సంఖ్యను తగ్గించేలా పనిచేయాలన్నారు. కోర్టు కేసులలో శిక్షలశాతం మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళ సంబంధిత కేసులలో, పోక్సో కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గంజాయి, గుడుంబా, పేకాట, పీడీఎస్ రైస్, నకిలీ విత్తనాలు, అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా నిఘా పెట్టాలని సూచించారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వచ్చిన వరదల సమయంలో ధైర్యంగా విధులు నిర్వహించిన 91 మంది అధికారులకు, సిబ్బందిని అభినందించారు. ప్రోత్సాహకాలు అందజేశారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, రవికుమార్, రవీందర్ పాల్గొన్నారు.

బరిలో దిగేందుకు 'బండి' నో ?

- కరీంనగర్ అసెంబ్లీకి పోటీ చేసేందుకు ఎంపీ సంజయ్ అనాసక్తి
- పార్లమెంటుకు వెళ్లే ఆలోచనలో ఫైర్‌బ్రాండ్ నేత
- శాసనసభకు పోటీ చేసేందుకు ఆశావహుల ఉత్సాహం
- కరీంనగర్ పార్లమెంటు రేసులో పొల్సాని సుగుణాకర్‌రావు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ అసెంబ్లీ బరిలో ఎంపీ బండి సంజయ్ ఈసారి ఉండేది అనుమానమే. ఇక్కడి నుంచి గత పార్లమెంటు ఎన్నికల్లో విజయఢంకా మోగించిన ఆయన ఈసారీ లోక్‌సభ బరికే మొగ్గుచూపుతున్నారని సమాచారం. 2018లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి, తన ప్రత్యర్థి, ప్రస్తుత మంత్రి గంగుల కమలాకర్‌పై హోరాహోరీగా పోరాడారు. మొత్తం బీజేపీకి 66,009 ఓట్లు పోలవ్వగా, బీఆర్‌ఎస్‌కు 80,983 ఓట్లు వచ్చాయి. 14,974 ఓట్ల మెజారిటీతో గంగుల విజయబావుటా ఎగురవేశారు. ప్రతి రౌండ్‌లోనూ గట్టి పోటీ ఇచ్చి, కొన్ని సందర్భాల్లో ఆధిపత్యాన్ని ప్రదర్శించిన బండితో విజయం దోబూచులాడింది. ఆ సానుభూతి 2019 పార్లమెంటు ఎన్నికల్లో బాగా పని చేసింది. ఆ సమయంలో పుల్వామా దాడులు, పాకిస్తాన్‌పై భారత్ సర్జికల్ స్ట్రైక్స్, సరిహద్దులో నెలకొన్న యుద్ధ వాతావరణం వెరసి.. జాతీయభావం ఎన్నికపై బాగా ప్రభావం చూపింది. దీనికితోడు బండి సంజయ్‌కి స్థానికుల నుంచి సానుభూతి వెల్లువెత్తడంతో ఎంపీగా ఘన విజయం సాధించారు. మొత్తం 4,98,276 ఓట్లు సాధించి, సమీప ప్రత్యర్థి బి.వినోద్‌కుమార్‌పై 89,508 ఓట్ల తేడాతో గెలుపొందారు.

కేంద్ర కేబినెట్ పక్కా అన్న హామీతోనే..

మొన్నటిదాకా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఎంపీ



బండి సంజయ్



సుగుణాకర్‌రావు

సంజయ్ తన హయాంలో దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో విజయాలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీకి మంచి ఫలితాలు తెప్పించారు. మునుగోడు బైపోల్‌లోనూ చివరికి వరకు బీజేపీ పోరాడింది. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి ఉన్న 7 శాతం ఓటుబ్యాంకును 32 శాతానికి తీసుకురావడంలో సఫలీకృతుడయ్యారు. ఒక దశలో బీజేపీ సీఎం అభ్యర్థిగా ప్రచారం జరగగా అనూహ్య పరిస్థితుల మధ్య రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఆ సమయంలోనూ తాను కరీంనగర్ నుంచే అసెంబ్లీకి పోటీ చేస్తానని సన్నిహితులతో, మీడియాతో చెబుతూ వచ్చారు. అసలు ఆ ఉద్దేశంతోనే పార్టీలో నగరంపై ఎవరికీ పట్టు చిక్కకుండా వ్యూహాత్మకంగా ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్, సెంట్రల్ అంటూ ఐదు భాగాలుగా విభజించారు. కానీ, ఇప్పుడు ఆకస్మికంగా కరీంనగర్ అసెంబ్లీ రేసు నుంచి సంజయ్ వైదొలగబోతున్నారన్న ప్రచారంపై ఆయన అభిమానులు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కేంద్రంలో మూడోసారి కూడా మోదీ ప్రభుత్వమే కొలువుదీరనుందని, ఈసారి పార్లమెంటుకు ఎన్నికైతే బండికి కేంద్ర కేబినెట్‌లో స్థానం పక్కా అన్న హామీ మేరకే ఆయన లోకసభపై ఆసక్తి చూపిస్తున్నారు. అయితే, ఈ ప్రచారంపై మరో రెండు రోజుల్లో బండి సంజయ్ నుంచి ప్రకటన రానుంది.

అసెంబ్లీ, పార్లమెంటు సీట్లకు తీవ్ర పోటీ

ఎంపీ బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి నుంచి తప్పుకున్నాక కరీంనగర్ అసెంబ్లీ, పార్లమెంటు సీట్లలో పోటీకి ఆశావహులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. ఒకవేళ నిజంగానే ఆయన పోటీ చేయకపోతే.. ఎవరిని రంగంలోకి దింపుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ సంతోష్ బీజేపీలో చేరి, అసెంబ్లీకి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈసారి తనకు కరీంనగర్ లోకసభ నుంచి అవకాశం ఇవ్వాలని బీజేపీ సీనియర్ నేత పొల్సాని సుగుణాకర్‌రావు ఇటీవల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి విన్నవించారు. మొన్నటిదాకా సంజయ్ కరీంనగర్ అసెంబ్లీ, పార్లమెంటు రెండు సీట్లకూ పోటీ చేస్తారన్న ప్రచారంతో వీరెవరూ ముందుకు వచ్చే సాహసం చేయలేదు. కానీ, తాజా ప్రచారంతో బీజేపీలోని ఆశావహులంతా ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు.

క్లుప్తంగా

15వ ఈశా గ్రామోత్సవం


మాట్లాడుతున్న ఈశా వలంటీర్లు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలోని మినీస్టేడియంలో ఈనెల 26, 27 తేదీల్లో ఈశా గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈశా వలంటీర్లు అజయ్, దీక్షత్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈశా గ్రామోత్సవంలో భాగంగా క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం ఉంటుందని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమాన్ ఆలయంలో ప్రేమ పెళ్లి


వివాహం చేసుకుంటున్న ప్రేమికులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇద్దరూ ఇష్టపడ్డారు.. ఇరు కుటుంబాల ఒప్పందంతో ప్రేమికులు ఆలయంలో గురువారం ప్రేమ వివాహం చేసుకున్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో ఇద్దరూ పెళ్లితో ఒక్కటయ్యారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన దుర్గం విజయ్‌బాబు అదే గ్రామానికి చెందిన నర్మద కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ తమ ప్రేమ విషయాన్ని ఇరు కుటుంబాల సభ్యులకు తెలిపి వారిని ఒప్పించారు. ఆలయంలో పురోహితులు కృష్ణమాచారి, నీలేశ్ వివాహం జరిపించగా, పలువురు ఈ ప్రేమజంటను ఆశీర్వదించారు.

అంధులకు చూపునిద్దాం



- చనిపోయినా నేత్రదానంతో కళ్లను సజీవంగా ఉంచొచ్చు
- అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో నేత్రదాతలు 900 మంది
- నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

కోల్‌సిటీ(రామగుండం): మరణించినా.. మన చూపు మరో ఇద్దరి దేహంలో ఈ లోకాన్ని చూసే అదృష్టం నేత్రదానంతో సాధ్యం. చీకట్లో మగ్గుతు


నేత్రాలను సేకరిస్తున్న టెక్నీషియన్ (ఫైల్)

న్నవారెందరో కంటిచూపు కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై ఏటా ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8 వరకు ప్రభుత్వాలు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయి. చనిపోయిన తర్వాత నేత్రాలు భూమిలో కలిసిపోకుండా.. మంటల్లో కాలిబూడిదవకుండా ఉండేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నేత్రదానంపై సదాశయ ఫౌండేషన్(94927 81306), లయన్స్ క్లబ్(98491 06589), తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం(73969 24667) తదతర స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లలో 900 మంది నేత్రదానం చేసి, 1,800 మందికి చూపునిచ్చారు. నేత్రదానానికి 60 వేల మందికి పైగా ప్రతిజ్ఞ చేయగా ఇప్పటివరకు 1,500 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నేత్రదానం ఎవరైనా చేయవచ్చు

నేత్రదానం చేయడానికి వయసు పరిమితులు లేవు. కళ్లజోడు పెట్టుకునేవారు, అధిక బీపీ, మధుమేహం, ఉబ్బసం వ్యాధులు ఉన్నవారు, కంటి శుక్లాల(కేటరాక్టు) ఆపరేషన్ చేయించుకున్నవారు కూడా చేయవచ్చు. హైపటైటిస్, ఎయిడ్స్ తదితర వ్యాధులున్నవారు మాత్రం చేయకూడదు. కళ్లను దానం చేయడానికి స్వచ్ఛంద సంస్థలకు, ఐ బ్యాంకులకు సమాచారం ఇవ్వాలి.

కొన్ని సందర్భాల్లో నలుగురికి చూపునివ్వొచ్చు

మనం మరణించినా.. మన నేత్రాలు మాత్రం సజీవంగానే ఉండాలంటే నేత్రదానం ఒక్కటే మార్గం. కళ్లను తీసిన తర్వాత ఐ బ్యాంకులో విశ్లేషించి, ప్రాసెస్ చేస్తారు. కార్నియాను 96 గంటల్లోపు ట్రాన్స్‌ప్లాంట్ చేస్తారు. ఐ బ్యాంకులు మానవ అవయవ మార్పిడి చట్టం పరిధిలోకి వస్తాయి. ఒకరు దానం చేసిన రెండు నేత్రాలతో కొన్ని సందర్భాల్లో నలుగురికి కంటిచూపు ప్రసాదించే అవకాశం ఉంటుంది. మిగతా సాధారణ సందర్భాల్లో మాత్రం ఇద్దరికి చూపు వచ్చేలా చేయొచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం మరణించిన కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ కళ్లతో నలుగురు అంధులకు చూపునిచ్చారు.

ఇవి పాటించడం తప్పనిసరి

వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలను తీయాలి. ఐ బ్యాంకు డాక్టర్ గానీ, శిక్షణ పొందిన టెక్నీషియన్ మాత్రమే స్టెరైల్ పద్ధతిలో కార్నియాను బయటకు తీస్తారు. వీరు మృతదేహం ఉంచిన చోటుకే వచ్చి, రక్తస్రావం లేకుండా 15 నుంచి 20 నిమిషాల్లో కళ్లు సేకరిస్తారు. మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను దానం చేయాలనుకుంటే మృతదేహం దగ్గర ఫ్యాన్లు ఆపేయాలి. ఏసీ, కూలర్లు ఉంటే ఆన్ చేయాలి. తడిపిన దూదిని ఐస్‌తోపాటు మూసిన కళ్లపై ఉంచాలి. తలకింద తలగడ పెట్టి ఎత్తుగా ఉండేలా చూడాలి.

మా అమ్మ కళ్లు దానం చేశాం



మా అమ్మ మల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె కళ్లను దానం చేశాం. అవి మరో ఇద్దరి దేహంలో సజీవంగా ఉండి, ఈ లోకాన్ని చూస్తున్నాయని ఆనందంగా ఉంది. నేను కూడా నేత్రదానం చేస్తానని అంగీకారపత్రం ఇచ్చాను.

– కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ మేయర్, రామగుండం

నేత్రదానంతో చూపు సజీవం



మరణించినా నేత్రదానంతో ఈ లోకాన్ని చూడొచ్చు. మనిషి మరణించాక నేత్రదానం చేయండి. దీనివల్ల చూపు సజీవంగా ఉంటుంది. ఇంతకంటే గొప్ప దానం మరొకటి లేదు. అపోహలు వీడి, అందరూ ముందుకు రావాలి.

– శ్యాంప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

12 మంది నుంచి సేకరించాం



రామగుండం లయన్స్ ఆధ్వర్యంలో నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల మరణించిన 12 మంది కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ చేసి, నేత్రాలు సేకరించాం. దీనివల్ల 24 మందికి కంటి చూపు వచ్చేలా చేశాం.

– తానిపర్తి విజయలక్ష్మి, అధ్యక్షురాలు, రామగుండం లయన్స్ క్లబ్

ప్రత్యేక చట్టం తీసుకురావాలి



నేత్రదానంపై ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కొన్ని దేశాల్లో మృతదేహాలను అక్కడి ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొని, అవయవాలను ఇతరులకు అమర్చేలా చూస్తున్నాయి. మా ఫౌండేషన్ ద్వారా 900 మంది మృతుల నుంచి కళ్లు సేకరించాం. సెలబ్రిటీలు సమాజహితం కోసం ముందుకు రావాలి.

– సీహెచ్.లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి, సదాశయ ఫౌండేషన్

బీసీలపై రాజకీయ పార్టీల వైఖరి మారాలి

- బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ చారి

కరీంనగర్: బీసీలపై రాజకీయ పార్టీలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని, ఈ వైఖరి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్తామని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ చారి హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి, వినతిపత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి జీఎస్. ఆనంద్ మాట్లాడుతూ.. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు బీఆర్‌ఎస్ కేవలం 23 సీట్లు, అర శాతం ఉన్న అగ్రవర్ణాలకు 60 సీట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలకు 60 సీట్లు, ముఖ్యమంత్రి పదవిని కేటాయించే పార్టీలకు తమ సంఘం తరఫున మద్దతు తెలుపుతామని అన్నారు. సెప్టెంబర్ 10న సామాజిక న్యాయం, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలని జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించే బీసీల సింహగర్జనను విజయవంతం చేయా


పూలే విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లని పిలుపునిచ్చారు. ఈ నెల 27న సింహగర్జన సన్నాహక సమావేశం ఉంటుందని, బీసీ సంఘాల నాయకులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, అధికార ప్రతినిధి దుంపట మురళి, జిల్లా ఉపాధ్యక్షులు శానగొండ వాసు, గొడిశెల రమేశ్, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జూడో పోటీలకు తెలంగాణ జట్లు

- 28 నుంచి సెప్టెంబర్ 1వరకు ఢిల్లీలో పోటీలు
- జాబితా ప్రకటించిన అనంతరెడ్డి, జనార్ధన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: జాతీయ జూనియర్స్ జూడో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషుల, మహిళల జట్లను రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ నెల 19, 20 తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన 8వ రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఢిల్లీలో ఈ నెల 28నుంచి సెప్టెంబర్ 1వరకు జాతీయస్థాయి పోటీలు జరగనున్నట్లు తెలిపారు.

పురుషుల జట్టు

ఎస్.డింజిల్ (ఆదిలాబాద్, 55కేజీ లోపు), పి.శివాజీ(యాదాద్రి, 60కేజీలోపు), టి.శివకుమార్ (యాదాద్రి, 66కేజీలోపు), అనాస్‌ఖాన్(హైదరాబాద్, 73కేజీలోపు), టి.రోహన్ సింగ్ (వరంగల్, 81కేజీలోపు), టి.భువనేశ్వర్ సింగ్ (వరంగల్, 90కేజీ లోపు),షేక్ ఫైజాన్ (హైదరాబాద్, 100కేజీ లోపు), టి.సాయిపుత్రనాథ్ (హైదరాబాద్, 100కేజీ పైన).

మహిళల జట్టు

కె.దీపిక (వరంగల్, 44కేజీ లోపు), కె.అనూష (వరంగల్, 48కేజీ లోపు), ఆర్.చాందిని (ఆదిలాబాద్, 52కేజీలోపు), బి.స్పందన (వరంగల్, 57కేజీ లోపు), పి.వసుధ (ఆదిలాబాద్, 63కేజీలోపు), నరేస్‌సుల్తానా (హైదరాబాద్, 70కేజీలోపు), హుమేరాబేగం (హైదరాబాద్, 78కేజీ లోపు), డి.నక్షత్ర (78కేజీ పై).

మహిళలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట: మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జెడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు క్యాంపు కార్యాలయంలో వీవోఏలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వీవోఏల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం గాలిపల్లి మాజీ సర్పంచ్ అయ్యన్నగారి లింగారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వీవోఏలు

బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఒగ్గ నర్సయ్య, శ్యామలాదేవి, పట్నం అశ్విని, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో కొనసాగిన నిరసనలు


నోటిఫికేషన్ ప్రతులు దహనం చేస్తున్న ఏఎన్‌ఎంలు

సిరిసిల్లటౌన్: పింఛర్ల సబ్సిడీ డబ్బులు ఇచ్చేవరకు పోరాటం విరమించబోమని మ్యాక్స్ సంఘాల ఆసాములు స్పష్టం చేశారు. గురువారం నాలుగో రోజు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రెండ్రోజుల క్రితమే పెద్ద సేట్లకు సంబంధించిన ఎస్‌ఎస్‌ఐ యూనిట్లకు పింఛర్ల డబ్బులను ప్రభుత్వం జమ చేసిందన్నారు. చిన్న ఆసాములైన తమకు ఇప్పటికీ జమకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి, కార్యదర్శి చేరాల అశోక్, రాజు, ఆనందం, రవిప్రసాద్, శ్రీహరి తదితరులున్నారు.

నోటిఫికేషన్ ప్రతులు దహనం

రెండో ఏఎన్‌ఎంలు కలెక్టరేట్ ఎదుట గురువారం తొమ్మిదో రోజు నిరాహార దీక్ష కొనసాగించారు. ప్రభుత్వం వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయకుండా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రతులను స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో చించి, తగులబెట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం, నాయకులు అజ్జ వేణు, సరోజ, మమత, పద్మ తదితరులున్నారు.

మాజీ సర్పంచ్‌లు..

తమ డిమాండ్లు నెరవేర్చడంలో సర్కారు తాత్సారం చేస్తోందని మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు దేవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై పట్టింపు లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. కలెక్టర్ ఎదుట మాజీ సర్పంచ్‌లు చేపడుతున్న దీక్ష గురువారం 16వ రోజుకు చేరింది. బుర్ర మల్లేశ్‌గౌడ్, గుమ్మడి కాంతయ్య, అలువాల లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, గౌరయ్య, లక్ష్మయ్య, పర్శయ్య, రాములు పాల్గొన్నారు.

యువకుడి ఇంటి ఎదుట బైఠాయింపు

వేములవాడ అర్బన్: వేములవాడ మండలంలోని సంకెపల్లికి చెందిన ఓ యువకుడి ఇంటి ఎదుట పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతి గురువారం బైఠాయించింది. సదరు యువకుడు తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేశాడని ఆరోపించింది. ఇప్పుడు మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు.

రూ.3 లక్షలతో ఉడాయించిన గల్ఫ్ ఏజెంట్

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కథలాపూర్(వేములవాడ): కువైట్ దేశంలో మంచి కంపెనీలో ఉపాధి చూపిస్తామని నమ్మబలికిన గల్ఫ్ ఏజెంట్.. వీసాల కోసం డబ్బులు తీసుకొని, మోసం చేశాడని పలువురు బాధితులు గురువారం కథలాపూర్ పోలీసులను ఆశ్రయించారు. వారి వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన గల్ఫ్ ఏజెంట్ అక్కడే ఓ ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. గతేడాది అక్టోబర్‌లో కువైట్ పంపిస్తానని కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటకు చెందిన 10 మంది యువకుల వద్ద రూ.30 వేల చొప్పున రూ.3 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడిచినా వీసాలు ఇవ్వకపోవడం, డబ్బులు అడిగితే సరిగా స్పందించకపోవడంతో బాధితులు ఇటీవల డిచ్‌పల్లికి వెళ్లి, ఆరా తీశారు. ఆ ట్రావెల్స్ మూసేసి ఉండటంతో తాము మోసపోయామని గ్రహించారు. ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత యువకులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులకు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి కందికట్కూర్ ఎంపీటీసీ సభ్యుడు


కిశోర్‌ను సన్మానిస్తున్న సత్యనారాయణ

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ ఎంపీటీసీ సభ్యుడు దొమ్మాటి కిశోర్ గౌడ్‌ను కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం శాలువాతో సత్కరించారు. రెండు, మూడు రోజుల్లో ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నారని తెలిపారు. కిశోర్ ఇటీవల బీజేపీకి రాజీనామా చేసిన విషయం విధితమే.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

గాలిపల్లి మాజీ సర్పంచ్ అయ్యన్నగారి లింగారెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, నాయకులు రాఘవరెడ్డి, పసుల వెంకటి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి గురువారం ఎల్‌ఎండీకి 300 క్యూసెక్కుల నీరు తరలుతోంది. ప్రాజెక్టుకు 700 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో వస్తోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 20.16 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

బీజేపీ గెలుపునకు కృషి చేయండి

- కర్నాటక ఎమ్మెల్యే బసవరాజ్ మతిముడ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసవరాజ్ మతిముడ్

బోయినపల్లి(చొప్పదండి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు కృషిచేయాలని కర్నాటక గుల్బర్గా రూరల్ ఎమ్మెల్యే బసవరాజ్ మతిముడ్ కోరారు. బోయినపల్లిలో గురువారం ఎమ్మెల్యే ప్రవాస్ యోజన సమావేశం నిర్వహించారు. బసవరాజ్ మతిముడ్ మాట్లాడుతూ వచ్చే నెల 20వ తేదీన ఎమ్మెల్యే ప్రవాస్ యోజన చొప్పదండి నియోజకవర్గ స్థాయి సమావేశం విజయవంతం చేయాలని కోరారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్, అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్, బీజేపీ మండలాధ్యక్ష, కార్యదర్శులు గుడి రవీందర్‌రెడ్డి, పరశురామ్ ఎడపల్లి, ఉదారి నర్సింహాచారి, రామిడి శ్రీనివాస్, చెంచు నాగరాజు, జనగం లక్ష్మణ్ ఉన్నారు.

మణిపూర్‌లో అకృత్యాలపై ఉద్యమించాలి

బోయినపల్లి(చొప్పదండి): మణిపూర్‌లో కుకీ మహిళలపై అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఉద్యమించాలని మణిపూర్ కుకీ మహిళలపై అకృత్యాల వ్యతిరేక కమిటీ జిల్లా నాయకులు కోరారు. గురువారం బోయినపల్లిలోని అంబేడ్కర్ చౌరస్తాలో జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరిగే ప్రజా ప్రదర్శన సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా నినదించేందుకు సిరిసిల్ల సభకు తరలిరావాలని కోరారు. భూ నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షుడు చెన్నమనేని పురుషోత్తంరావు, బొజ్జ కనకయ్య, టీజేఏసీ జిల్లా చైర్మన్ బొడ్డు రాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు గండా థామస్, నేదునూరి నర్సయ్య, నక్క మోహన్, కంకణాల నర్సక్క తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఎల్లారెడ్డిపేట: బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. ఒక్కో విద్యార్థికి రూ.2500 చొప్పున పది మందికి స్కాలర్‌షిప్స్ అందించారు. ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, హెచ్‌ఎం హనుమాండ్లు, ఉపాధ్యాయులు ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి గర్శుల స్వామి, రాచర్ల వెంకన్నవేణుగోపాల్‌రావు, బయోస్టాడ్ కరీంనగర్ జిల్లా మేనేజర్ బత్తిని తిరుపతి, కరీంనగర్ డిస్ట్రిబ్యూటర్ హనుమాన్, ఆగ్రోస్ మహేశ్, స్థానిక డీలర్లు భాస్కర్, అశోక్ భార్గవ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం స్పందించి విద్యారంగం సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు కోరారు. ఎల్లారెడ్డిపేటలో మండల సభ్యత్వ నమోదు చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. ఖాళీగా ఉన్న 22 వేలకుపైగా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 2018 పీఆర్సీ బకాయిలు చెల్లించాలన్నారు. అన్ని సొసైటీలను ఒకే డైరెక్టరేట్ పరిధిలోకి తీసుకురావాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శులు ఆడెపు శివకుమార్, పాముల స్వామిగౌడ్, తిరుపతిజాదవ్, శివరాత్రి సంతోష్ పాల్గొన్నారు.